కథ

విల్లు నెక్కుపెట్టి విడిచిన బాణంలా రివ్వుమని దూసుకుంటూ వచ్చి ప్లాట్ ఫారం దగ్గర నిల్చుంది మెయిలు. అంతకుముందే ప్రారంభమైన కలకలం స్టేషన్‌లో ఒక్కసారిగా విజృంభించింది. ఎలక్ట్రిక్ లైట్ల వెలుగులో, జనం హడావుడిలో ప్లాట్ ఫారం అకస్మాత్తుగా మేలుకున్నట్లుంది. ఆ కొద్ది నిమిషాలు ఆ ప్రాంతంలో గొప్ప చైతన్యం కనిపించింది. కంపార్టుమెంటులవైపు చూస్తూ నడుస్తున్న నాకు ఒక పెట్టెలో నే నెరుగున్న ముఖం ఒకటి కనిపించింది.

అవును...సందేహం లేదు; శ్రీనాథ్! పక్కన ఎవరో స్త్రీతో మాట్లాడుతున్నాడు. పాత సంగతులు జ్ఞాపకం రాగా కొన్ని నిమిషాలు అలా నిలబడిపోయాను. పదేళ్లయింది మేం కలుసుకుని. అప్పటి రోజుల్లో మేము రోజూ సాయంకాలం రైల్వే స్టేషనుకు వచ్చేవాళ్లం.

మనసు ఒక్కసారి గతంలోకి వెళ్లింది.

❄ ❄ ❄

మెయిలు రాగానే రోజులా మా కార్యక్రమం ఆరంభించాం. గార్డు పెట్టె దగ్గరనుంచి ఇంజనుదాకా వరసాగ్గా పెట్టెలోని మొహాల్ని పరిశీలించడం ప్రారంభించాం. రోజూ సాయంకాలం మా కదేపని. మెయిలు రాగానే శ్రద్ధగా అన్ని కంపార్టుమెంటులూ తనిఖీ చేస్తాం. ప్రయాణీకు లందర్నీ విమర్శగా చూస్తాం. థర్డ్ క్లాసు పెట్టెలో కిక్కిరిసిపోయిన మనుష్యుల దగ్గరనుంచీ రెండవ తరగతీ, మొదటి తరగతీ, ఏసీ పెట్టెలలో విశ్రాంతిగా,



ప్రశాంతంగా ప్రయాణించే మహానుభావుల్ని వారి ఆకర్షణీయమైన సామాన్లనీ చూసి ఆనందిస్తాం. మధ్య మధ్య అందమైన అమ్మాయిల వదనాలమీద మా దృష్టి మరికొన్ని సెకనులు నిల్చేది.

నేనూ, శ్రీనాథ్, ప్రకాష్ రైలాగినప్పుడు కన్పించే దృశ్యాల్ని చాలా ఉత్సాహంతో తిలకిస్తాం. టీ, కాఫీ అంటూ; మీల్స్ అంటూ రెండు చేతులలో సామాను పట్టుకుని నైపుణ్యంగా జనాల్ని తప్పించుకుంటూ వెళ్లి పోయే హోటల్ వెండర్లు, పత్రికలు, పళ్లు, మిఠాయిలూ అమ్ముకునేవాళ్లు. తమ కెక్కడ చోటు దొరకదోనని తమ సామానుతో సహా పరిగెత్తే ప్రయాణీకులు. చోటుకోసం, ప్రవేశం కోసం జరుగుతుండే వాగ్వాదాలూ...ఇవి మామూలుగా కనిపించేవైనా, వాటిని చూడడం అదొక సరదా! ప్రయాణీకుల అవస్థలు చూసి నవ్వుకున్నాం. చిన్నచిన్న పిల్లలతోనూ, బోల్డు సామానుతోనూ ప్రయాణం చేసే కుటుంబీకుల్ని సానుభూతితో చూస్తాం. చివరకు రైలు పరిగెడుతుంటే ఎవరో ఆప్త బంధువుల్ని రైల్లో సాగనంపుతున్నట్లు, అందరి ప్రయాణీకులకు వర్తించేటట్లు చేతు లూపుతూ రైలుతో కొంతదూరం నడిచేవాళ్లం. దూరంగా వెళ్లిపోతున్న రైలుతోపాటు కరిగిపోయిన కలలోంచి ఘనీభవించిన యథార్థస్థితిలోకి వస్తున్న ప్లాట్‌ఫారంమీద నిలబడి ఒకరివైపు ఒకరు చూసుకుని మెల్లగా నడుచుకుంటూ సిమెంటు బెంచీలమీదకు చేరేవాళ్లం.

రాజమండ్రి పెద్దపట్నం అయినా, మేము మాత్రం సాయంకాలం వినోద కార్యక్రమంలా మెయిలుకోసం స్టేషనుకి రావడం, ప్లాట్‌ఫారం మీద మెయిలు వచ్చేముందర కొంతసేపు, వెళ్లిపోయాక కొంతసేపు కాలం గడపడం అల వాటైపోయింది. మెయిలు వచ్చేముందర ప్లాట్‌ఫారం ఎలక్ట్రిక్ లైట్ల వెలుగులో, ప్రయాణీకుల సందడితో ప్రియుడికోసం అలంకరించుకుని ఎదురుచూస్తున్న ప్రేయసిలా ఉంటుంది. ఆ కలకలం, సన్నహాలు చూస్తుంటే మాకు కాలం ఇట్టే గడిచిపోయేది. మెయిలు వెళ్లిపోయిన తర్వాత చాలాసేపు కబుర్లు చెప్పుకోవడం మాకు సరదా. అందులోనూ ప్రేమగురించి మాట్లాడుకోవడం మాకు చాలా ఇష్టం. అప్పట్లో శ్రీనాథ్ ప్రేమ దినదిన ప్రవర్ధమాన మవుతున్న వైనం గురించి రోజూ కొత్త విషయాలు వింటూండేవాళ్లం.

ఇవ్వాళ వీథిలో నుల్చుని ఆమె చాలాసేపు నా వైపు చూసిందనో, ఇవ్వాళ పలకరిస్తే చాలా సరదాగా మాట్లాడిందనో ప్రారంభించేవాడు. ఆ రోజు సంగతులు గురించి ముగ్గురం కాస్సేపు చర్చించి, స్త్రీల మనస్తత్వం అగాధం అనీ, ప్రకాష్, నేనూ అన్నాం. ఏమైనా ఆ అమ్మాయిని శ్రీనాథ్ ప్రేమిస్తున్నాడని మేము నిర్ణయించుకున్నాం. ఆమెగురించి శ్రీనాథ్ చెబుతున్నప్పుడల్లా మొహంలో కొంచెం సిగ్గు కన్పించేది.

శ్రీనాథ్ నల్లగా ఉన్నా, అతని నవ్వులో చెప్పలేని అందం ఏదో ఉంది. చాలా బోళా మనిషి. అమాయకంగా మాట్లాడుతాడు. ఎప్పుడూ చాలా సరదాగా ఉంటాడు. మేం ముగ్గురం ఒకే వయస్సువాళ్లం. శ్రీనాథ్ ఎక్సైజ్ సబిన్‌స్పెక్టర్; నేను, ప్రకాష్ స్కూలు టీచర్లం. ముగ్గురం బ్రహ్మచారులమే. క్లబ్బులో పేకాట దగ్గర స్నేహితు లయ్యాం. కొన్నాళ్లనుంచీ పేకాట మానేసి సాయంకాలం స్టేషను ప్లాట్‌ఫారంమీద గడపడం మొదలెట్టాం.

మేం ముగ్గురం వివాహం చేసుకోకపోవడానికి కారణం ఒక్కటే. మాకు నచ్చిన అమ్మాయిలు కనిపించలేదు. మా స్నేహం ప్రారంభమైన మొదటి రోజులలో మేము వివాహం చేసుకోబోయే అమ్మాయి లెలా ఉండాలో చర్చిస్తుండేవాళ్లం. అస లటువంటి అమ్మాయిలు దొరకరేమోనని కూడా మాకు అనుమానంగా ఉండేది. అప్పుడప్పుడు మా అమ్మ..."ఆ తణుకువాళ్లు మళ్లీ ఉత్తరం రాశారురా" అని గోల పెట్టినప్పుడు కాసేపు ఆ అమ్మాయి జ్ఞాపకం వచ్చేది. సాయంకాలం ప్లాట్‌ఫారంమీద నేను మా స్నేహితులతో వర్ణించిన ఊహాసుందరికీ, ఈ అమ్మాయికీ ఎంత భేదమో చూసుకుని అమ్మకు జవాబు చెప్పకుండా ఊరుకునే వాడిని. ప్రకాష్ పుస్తకాలు తెగ చదువుతాడు. ఆ పుస్తకంలో కవులు వర్ణించే నాయికల లాంటి భార్య కావాలంటాడు. శ్రీనాథ్‌కు సినిమా స్టార్ల పిచ్చి. అందులోనూ హిందీతారలంటే మరీ అభిమానం.


ఇందిరలో కొద్దిగా సినిమా తారల పోలిక లున్నాయి. ఆమె డాక్టర్ శివప్రసాద్‌గారి రెండవ కుమార్తె. వయస్సు ఇరవై సంవత్సరాలు. శ్రీనాథ్ ఇప్పుడు శివప్రసాద్‌గారి పక్కింట్లోనే అద్దెకు ఉంటున్నాడు. శ్రీనాథ్ ఆ ఊరు కొచ్చిన దగ్గరనుంచి ఇందిర అంటే చాలా అభిమానం చూపించేవాడు. ఆమె దృష్టి నాకర్షించాలని అనేక పనులు చేస్తుండేవాడు. కాని, చాలాకాలంనుంచి ఇందిర తన అభిప్రాయ మేమిటో తేల్చలేదు. ఈలోపల శ్రీనాథ్ శివప్రసాద్‌గారితో పరిచయాన్ని పెంచుకుని తరచూ వాళ్లింటికి వెళ్లసాగాడు.

మొదట్లో శ్రీనాథ్‌కు ఆమెపై గల ఆకర్షణంతా రానురాను ఆరాధనగా మారింది. మాకు ఇందిరలో అంత ప్రత్యేకత ఏమీ కన్పించకపోయినా, శ్రీనాథ్ ప్రేమనిమాత్రం గౌరవించసాగాం. శ్రీనాథ్ తన తల్లితో ఉంటున్నాడు. ఆవిడకు ఏభై ఏళ్లుంటాయి. చాలా మంచిమనిషి. ముగ్గుబుట్టలా నెరసిన తలతో, బక్కపల్చని ఆమె విగ్రహంలో చిరునవ్వు మొహం, ఏదో జాలి, అభిమానం వ్యక్తం చేస్తుండేది. ఆమెకు ఇద్దరు కొడుకులు. శ్రీనాథ్ పెద్దవాడు. రెండవవాడు త్రినాథ్. డాక్టర్ కోర్స్ పాసై, విశాఖపట్నంలో హౌస్ సర్జన్ చేస్తున్నాడు.

శ్రీనాథ్ ఇంట్లో లేనప్పుడు ఇందిర వాళ్లింటికి వచ్చి అతని తల్లితో మాట్లాడుతుండేదట. పత్రికలూ, పుస్తకాలూ అడిగి తీసుకువెళ్తుండేది. ఆమెకు అప్పుడప్పుడు గులాబిపువ్వులుకూడా ఇస్తుండేవాడు శ్రీనాథ్. ఆమెకూడా అత నిచ్చిన పూలు సిగలో పెట్టుకునేది. ఆమెకు కూడా శ్రీనాథ్ అంటే అభిమానం అని తోచసాగింది. శ్రీనాథ్ ఎంతో ఓపికతో ఇందిర అనురాగం సంపాదించడానికి ప్రయత్నించేవాడు.

మేము ముగ్గురం సాయంకాలం రైల్వే స్టేషనువద్ద కలుసుకోగానే ఆ రోజు జరిగిన విషయ మేదైనా ఉంటే మాకు చెప్పేసేవాడు. స్టేషను ప్లాట్‌ఫారంమీద పచార్లు చేస్తూ కబుర్లు చెప్పుకోవడం అంటే మా కెంతో సరదాగా ఉండేది. పగలంతా ఆ సమయంకోసం ఎదురు చూసేవాళ్లం. ఎన్ని పనులున్నా ఆరు గంటలకల్లా ప్లాట్‌ఫారంమీదకు చేరుకునేవాళ్లం.

మా స్కూల్లో సరోజ



టీచరు కొత్తగా వచ్చారు. ఆవిడ మొహం అంతా స్ఫోటకం మచ్చలతో నల్లగా, అందవికారంగా ఉంటుంది. కాని, ఆవిడ కున్న మేధస్సు అపారం. పిల్లలు ఆవిడ చెప్పే పాఠాల్ని ఎంతో శ్రద్ధగా వింటారు. ఆవిడ ఎవ్వరితో మాట్లాడినా ఎంతో ఆప్యాయంగా ఉంటుంది.

ప్రకాష్, శ్రీనాథ్‌లతో ఆ రోజు చర్చను ప్రారంభిస్తూ సరోజ టీచరును దృష్టిలో పెట్టుకుని "అందం అంటే బాహ్యసౌందర్యం అని అనుకుంటాం కాని, నిజానికి ఆంతరంగిక సౌందర్యం తెలిసిననాడు ఎంతో ఆనందం కలుగుతుందోయ్" అన్నాను.

ప్రకాష్ అవునని అంటూ, "స్త్రీ ఆంతరంగిక సౌందర్యం తెలుసుకునేంత అవకాశం కావాలి కదా?" అని అన్నాడు.

శ్రీనాథ్ మాతో ఏకీభవించలేదు. "స్త్రీకి బాహ్య సౌందర్యమే ముఖ్యం. ఆంతరంగిక సౌందర్యం అనేది చెప్పుకోవడానికి బాగానే ఉంటుంది. అది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందితప్ప ప్రత్యేకంగా ఉండదు" అని అన్నాడు.

"అంటే?" అన్నాను అర్థంకాక.

"అంటే మరేమీ లేదు. తన చుట్టూ వాతావరణం మంచిదైతే ఆమె మంచి దవుతుంది. తనచుట్టూ చెడ్డవారే ఉంటే....ఆమె చెడ్డదవుతుంది. తల్లిదండ్రులు, చుట్టు పరిసరాల వాతావరణం మంచిదైతే పిల్లల అంతరంగాన్ని సౌందర్యమయం చేయగలదు. కాని, భౌతిక సౌందర్యం భగవంతు డిచ్చేది. అది ఉన్న స్త్రీ కలిగించే ఆనందం గొప్పది" అని శ్రీనాథ్ అన్నాడు.

"భౌతిక సౌందర్యం ఉండి అంతరంగిక సౌందర్యం లేకపోతే...?" అని ప్రశ్నించాను.

"అది అంత సమస్య అనుకోను. ప్రయత్నించి ఆమెను మంచిదానిగా మార్చవచ్చు. కాని, బాహ్యసౌందర్యం అబ్బడం అంత సులభం కాదు. దానికున్న ఆకర్షణ దేనికీ లేదు. నా విషయం ఒకటి చెప్తాను వినండి" అని సిగరెట్టు తీశాడు శ్రీనాథ్.

అతనితోపాటు మేమూ సిగరెట్లు వెలిగించాము. శ్రీనాథ్‌ని ఈ చర్చ ఎందుకోగాని, బాగా కదిలించిందని గ్రహించాం.

"మా మామయ్య కొక కూతు రుంది. ఆమెకు పోలియోవలన ఒక కాలు కుంటి. ఇప్పుడు దాని వయస్సు పదిహేడు సంవత్సరాలు. అదంటే తల్లిదండ్రులకు చాలా అభిమానం. నా డిగ్రీ అయిన సంవత్సరం తర్వాత మా నాన్నగారు హఠాత్తుగా పోయారు. ఉన్న ఎకరం పొలం అమ్మి తమ్ముడిని డాక్టరు కోర్సులో చేర్పించారు. ఆయన స్కూలు టీచరు కావడం వలన బొటాబొటిగా నడిచేది సంసారం. నాన్నగారు పోవడంతో పరిస్థితులు తల్లకిందు లయ్యాయి. ఇంట్లో నానా ఇబ్బందులు పడుతున్నాం. ఆ సమయంలో మామయ్య వచ్చి మమ్మల్ని ఆదుకున్నాడు" అని ఒక్క నిమిషం ఆగి చివరిదమ్ము లాగి సిగరెట్ పడేశాడు.

కథ వినడానికి ఎంతో బాగుంది.

మళ్లీ ప్రారంభం. "మామయ్య మా స్థితికి చాలా సానుభూతి చూపించాడు. తనకు చేతనైన సహాయం తప్పక చేస్తానన్నాడు. నన్ను తన కూతురిని వివాహం చేసుకోమని అడిగాడు. అలాంటి ఉద్దేశాలు లేవని చెప్పేశాను. నేను నా మనస్సులో ముద్రించుకున్న రూపాన్నే నిశ్చయంగా పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. నా విషయం లాభం లేదని తెలిశాక తమ్ముడిని కుదిపిచూశాడు. వాడి డాక్టరీ పూర్తయ్యాక ప్రాక్టీసు పెట్టించే బాధ్యత తన దన్నాడు. వాడికి బలమైన కోరిక ఉండడం, పరిస్థితులు సహకరించక పోవడంవలన మామయ్య ప్రతిపాదనను ఒప్పుకున్నాడు. అప్పటినుండి తమ్ముడి బాగోగులు ఆయనే చూసుకుంటున్నాడు. ఈమధ్య అమ్మ నా వివాహం గురించి ఒత్తిడి చేస్తోంది. నేను ఇందిరను వివాహం చేసుకుంటాను అని చెప్పాను. అప్పటినుండి మా అమ్మ వాళ్లతో ఎలాగైనా ఈ విషయం కదిపి, నా వివాహానికి ఏర్పాట్లు చెయ్యాలని చూస్తోంది. వాళ్లుకూడా సుముఖంగా ఉన్నట్లున్నారు."

ఆనాటి చర్చ ముగిస్తూ, "నీలాగా కుండబద్దలు కొట్టినట్లు నిర్మొహమాటంగా మనస్సులో ఉన్న విషయం చెప్పడం అందరికీ చేతకాదోయ్. అలా చెప్పడంవల్ల మొదట్లో అందరికీ కష్టమనిపించినా, తరువాత సంతోష ప్రద మవుతుంది" అన్నాను నేను.

"ఏమైనా, నా తత్వమంతే" అంటూ లేచాడు శ్రీనాథ్.

ముగ్గురం కొంతదూరం కలిసి నడిచి, ఎవ రిళ్లకు వాళ్లు విడిపోయాం.

మర్నాడు మెయిల్ టైముకు మేము ప్లాట్‌ఫారం మీదకు వెళ్లేసరికి, శ్రీనాథ్ తనతోపాటు తన తమ్ముడు త్రినాథ్‌ను తీసు కొనివచ్చి పరిచయం చేశాడు. పచ్చని శరీరఛాయ, చక్కని కనుముక్కు తీరూ, ఎత్తయిన విగ్రహం అతనిది. మాతో సరదాగా గడిపినా, శ్రీనాథ్‌లా అతిగా మాట్లాడే తత్వం కా దతనిది. ముభావంగా ఉంటాడు. అతని హౌస్ సర్జన్ గురించి, విశాఖపట్నం కబుర్లు చెప్పాడు. రేపు తిరిగి వైజాగ్ వెళ్లిపోతున్నట్లు చెప్పాడు. అన్నదమ్ము లిద్దరూ తొందరగానే వెళ్లిపోయారు. నేను, ప్రకాష్ కొంతసేపుండి ఇళ్లకు బయలుదేరాం.

మర్నాడు సాయంకాలం మళ్లీ కలుసుకుని ముగ్గురం ప్లాట్‌ఫారంమీద బాతాఖానీ మొదలుపెట్టాం.

శ్రీనాథ్ ప్రారంభించాడు. "మావా డొక కొత్త సమస్యను తెచ్చిపెట్టాడు" అని అన్నాడు.

నేను, ప్రకాష్ ఏమిటా అని ఒకరి మొహం ఒకరం చూసుకున్నాం.

"మామయ్య కూతుర్ని పెళ్లాడుతానని డాక్టరు కోర్సుమీది ఆశ కొద్దీ మామయ్య షరతుకు ఒప్పుకున్నవాడు ఇప్పుడు వాడు చేసిన పనికి విచారిస్తున్నాను" అన్నాడు శ్రీనాథ్.


"ఏం జరిగింది?" అడిగాడు ప్రకాష్.

"త్రినాథ్ తనతో డాక్టర్ చదివిన వసంతను ప్రేమించాడుట. మాకు తెలియకుండా రిజిస్టర్

## దర్శకుడి కోసం నటీమణుల పాట్లు!

సినిమాలో వేషం కోసమైతే పాట్లు పడొచ్చు కానీ ఇదేమిటంటారా? తబ్బూ, రవీనాటండన్ దర్శకుడు మాధుర్‌భండార్కర్ చిత్రంలో చేసేందుకు రకరకాల నఖరాలు చేస్తున్నారనేది తాజాగా వినిపిస్తున్న సమాచారం. కానీ తానూ, తబ్బూ 'చాంద్‌నీ బార్' కాలం నుంచి మిత్రులమనీ, తమ మధ్య గొడవల్లేవనీ మాధురే చెప్పాడు. రవీన కూడా తమ ఇద్దరి మధ్యకూ తనను, మాధుర్ రావద్దన్నట్టుగా చెప్పిందని ఓ పత్రిక రాసింది. "అలాంటప్పుడు నేనేమంటాను? అయినా వాళ్లిద్దరి మధ్యా ఏముందో నాకేం తెలుసు? 'ఆన్' చిత్రం నుంచి నేను తప్పుకునేందుకు కారణం అంతకు ముందు నాకూ, ఫిరోజ్ నడియాడ్‌వాలాకూ గొడవలు రావటమే. ఇప్పుడేమీ లేవు" అంటూంది రవీన.

ఎస్.



మేరేజి కూడా చేసుకుని, ఆరు నెలలనుంచి ఆమెతో కాపురంకూడా చేస్తున్నాడట."

"మరి మీ మామయ్య కూతురి సంగతి...?" అడిగాను నేను.

"పాపం మామయ్యకు ఈ సంగతు లేవీ తెలియవు. ఇందిర విషయం అమ్మ రాసినట్లుంది...నా వివాహం జరిగిన వెంటనే వాడిది చేసెయ్యవచ్చునని జవాబు రాశాడు మామయ్య."

"అయితే, ఇప్పు డెలా?" ప్రకాష్ అడిగాడు.

"అదే నేను ఆలోచిస్తున్నాను. వాడి గొడవతో ఈ మూడు రోజులనుంచీ నాకు, అమ్మకు నిద్రాహారాలు కూడా సరిగా లేవు. మామయ్య కేం జవాబు చెప్పాలో తెలియడం లేదు." దిగులుగా అన్నాడు శ్రీనాథ్.

నేను, ప్రకాష్ ఎంత ఆలోచించినా ఈ సమస్యకు పరిష్కారం చూపలేకపోయాం. శ్రీనాథ్ తన మామయ్యకు ఏమని సమాధానం చెప్పాలి? త్రినాథ్ అన్నీ తెలిసుండీ బాధ్యతారహితంగా పెళ్లి ఎందుకు చేసుకోవాలి? మామయ్య చదువు కిచ్చిన డబ్బు విషయం ఎత్తితే, వడ్డీతో సహా తీర్చేస్తా నంటున్నాడుట త్రినాథ్. శ్రీనాథ్ తమ్ముని ఏమీ అనలేకపోయాడు. వాడికి అప్పుడు చిన్నతనం. పెళ్లి అంటే ఏమిటో తెలియకపోవడం అని అతని వాదన. కాని, మామయ్య ఆశలు, నీరజ భవిష్యత్తు ఏమిటి? మామయ్యకు జరిగిన విషయం ఎలా చెప్పాలి అని శ్రీనాథ్ బాధ పడుతున్నాడు. కుటుంబానికి పెద్దవాడిగా ఏంచెయ్యాలా అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు. ఎంతో భయపడుతున్నాడు. అదీకాక, శ్రీనాథ్‌కి అనకాపల్లి ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ రావడం, ఇందిర వివాహ విషయంలో డాక్టర్ శివప్రసాద్ కొంత గడువు అడగడం...పద్మవ్యూహంలో చిక్కుకుపోయినట్లు ఒంటరి అయిపోయాడు.

నన్ను పెళ్లి చేసుకోమని మా ఇంట్లో ఒత్తిడి ఎక్కువైంది. ఎన్ని సంబంధాలు చూసినా, నా ఊహాసుందరి నాకు కన్పించలేదు. వచ్చిన సంబంధాలలో తణుకు సంబంధమే బాగనిపించింది. ఆ అమ్మాయిని చేసుకోవడానికి అంగీకరించాను.

రోజులాగే మెయిలు టైముకి ప్లాట్‌ఫారం మీదకు చేరాం. శ్రీనాథ్ బాధ పడుతున్నట్లు కనిపించాడు. మామయ్య వచ్చి నానా రగడా చేసివెళ్లాడట. చుట్టా లందరిలో తన పరువు తీసిన శ్రీనాథ్‌వాళ్లను ఊరకనే వదలను అని ఎగిరాడట. ఏరు దాటి తెప్ప తగలేసే రకమని అన్నాడట. కొడుకు అలా ప్రవర్తిస్తే తల్లికి బుద్ధి ఉండక్కర్లేదా అని వాళ్ల తల్లిని తిట్టాడుట. పంచాయితీ పెట్టి పరువు తీస్తానని బెదిరించాడట. తన కూతురు భవిష్యత్తు పాడుచేసిన శ్రీనాథ్ వాళ్లు బాగుపడరని నానామాటలు అని వెళ్లాడుట. శ్రీనాథ్, తల్లి ఆయన మాటలకు బాధపడ్డారు. కాని, త్రినాథ్‌మటుకు ఏమీ పట్టనట్లు త్వరలో నర్సింగ్ హోమ్ పెడుతున్నట్లు ఇంటికి ఉత్తరం రాశాడట.

అలాటి పరిస్థితిలో శ్రీనాథ్ బదిలీ అయి వెళ్లాడు. నేను, ప్రకాష్ కొన్నిరోజులు ప్లాట్‌ఫారంమీద కలుసుకునే వాళ్లం. తర్వాత ప్రకాష్ కూడా బదిలీ అయి తాడేపల్లిగూడెం వెళ్లిపోయాడు. నేను మటుకు రోజూ వచ్చి మెయిలు వెళ్లిపోయాక ఆలోచిస్తూ కూర్చుండేవాడిని. ఆ ప్లాట్‌ఫారంమీద సన్యాసులు, సంసారులు, తాగుబోతులు, మంచివారు, చెడ్డవారు, టికెట్ లేనివాళ్లు...ఇంకా ఎన్నెన్నో రకాల మనుష్యులు కన్పిస్తుండేవారు. అందరివీ మానవాకారాలేకాని, వాళ్ల మాటల్లో, మనసుల్లో, భావాల్లో, ప్రవర్తనలో ఎన్నో తేడాలు. అందరూ ఏవో ఆశలనూ, కోరికలనూ దృష్టిలో పెట్టుకుని జీవితం గడుపుతున్నవారే. ఆ ఆశలే వారి జీవితాల్ని నడిపిస్తాయి. దూరంగా ఎక్కడికో గమ్యం చేరాలనే తాపత్రయంతో పరిగెత్తే రైలు బండివంటి జీవితాలే అందరివీ. ఆ పరుగులోనే కాలం గడిచిపోతుంది. బాల్యం మొదలు వృద్ధాప్యందాకా ఆ ఆరాటంతోనే పయనిస్తారు. మధ్యమధ్య మజిలీలులాగా ఏవో సంఘటనలు జరుగుతుంటాయి. రైలుబండి స్టేషనులో ఆగి సేద తీరి మళ్లీ బయలుదేరినట్లు జీవిత మజిలీలో కొద్దిక్షణా లాగి మళ్లీ పయనిస్తుంటాడు మానవుడు. కాలదూరాలమధ్య రైలుకు కొద్దిక్షణాలు విశ్రాంతి ఇచ్చే ప్లాట్‌ఫారం లాంటివి జీవితంలోని మలుపులు అని అనిపించేది.

రాజమండ్రిలో ఉండగానే నాకు వివాహమైంది. నేను అందరిలాగే సంసారం ప్రారంభించాను. పదేళ్లలో మాకు ఇద్దరు పిల్లలు. చాలాకాలం నా మదిలో మెదిలిన నా ఊహాసుందరి రానురాను కనిపించడం మానేసింది. డబ్బు చాలకపోవడం, స్కూలు గొడవలు, ఇంట్లో పిల్లల అల్లరితో చికాకులూ....క్రమంగా నా మనస్సు నాక్రమించుకున్నాయి. నేను ఎప్పుడూ డబ్బు సంపాదన గురించే ఆలోచిస్తున్నా. జీవితంలో ఇంకా ఏదో మార్పు వస్తుందనో, ఇంకా ఎక్కువ డబ్బులు సంపాదించాలని ప్రయత్నిస్తున్నాను. రాజమండ్రి వదిలి మూడు ఊళ్లు తిరిగాక మళ్లీ సొంతగూటికే చేరుకున్నాను. ప్రకాష్ ఉత్తరం రాశాడు. మళ్లీ తనకు కూతురు పుట్టిందని.

నా ఊహలకు భంగం కలిగిస్తూ, "హలో, రామారావ్!" అని పలకరించాడు శ్రీనాథ్.

"అవునూ...ఇప్పు డెక్క డుంటున్నావు?" అని ప్రశ్నించాను నేను తేరుకుని.

"తునిలో. ఏమిటి విశేషాలు. ఒకసారి రా...మనం కలిసి చాలా రోజులైంది."

కొన్ని ప్రశ్నలు, కొన్ని సమాధానాల తర్వాత నాతో, "నీకు చెప్తుండేవాడిని...మా మామయ్య కూతురు నీరజ" అని తన భార్యను చూపించాడు. రైలు కదిలిపోతుంటే తన విజిటింగ్ కార్డు ఇచ్చి వాళ్ల ఊరు తప్పక రమ్మన్నాడు. రైలు ప్లాట్‌ఫారం దాటి వెళ్లింది.

శ్రీనాథ్ చివరకు తన మామయ్య కూతురినే వివాహం చేసుకున్నందుకు నేను ఆశ్చర్యంతో కొద్దిసేపు అలాగే నిలబడి ఆలోచిస్తూండిపోయాను. ■

## ఇక జీవితచరిత్రలే చేస్తుందా?

తన ముగ్ధమోహనమైన అందాలతో ప్రేక్షకులను అలరించి కొంత కాలం తెరకు దూరమైన నటి మనీషాకోయిరాలా. 'ఎస్కేప్ టు తాలిబాన్' చిత్రంలో ఆఫ్ఘనిస్థాన్ నుంచి పారిపోయి వచ్చి కోల్‌కటాలో స్థిరపడిన గృహిణిగా చేస్తున్నది. ఓ తాలిబన్ చేతి లోంచి సుస్మితాబెనర్జీ ఎలా తప్పించుకున్నదో చెప్పే చిత్రం 'ఎస్కేప్ టు తాలిబన్.' "ఇందిరాగాంధీగా 'ఇందిర'



చిత్రంలో చేస్తున్నాను. ఆమెలా చేయాలంటే ఆమెను గురించి చాలా తెలుసుకోవాలి కదా! అందుకని చాలా పుస్తకాలు స్టడీ చేస్తున్నా. ఐపిఎస్ ఆఫీసర్ కిరణ్‌బేడీ పాత్ర చేయమని కూడా ఆఫర్ వచ్చింది. అట్లాంటి పాత్రలు చేసేందుకు నేనే పనికొస్తాన నుకుంటున్నట్టున్నారు దర్శకనిర్మాతలు" అంటున్నది మనీషా. కానీ గతంలో 'ఆంధీ' లో ఇందిరాగాంధీని పోలిన పాత్ర చేసింది అలనాటి బెంగాలీనటి సుచిత్రాసేన్. ఆమెతో సమానంగా చేయగలదా, లేక ఆమెనే మించి పోతుందా అనేది చిత్రం విడుదలయ్యే దాకా వేచివుండి చూడ వలసిన విషయం.

ఎస్.